క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శావల్యాపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో నేటి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందని మండల విద్యుత్‌శాఖాధికారి జవ్వాజి నటరాజ్ బుధవారం తెలిపారు. ముళ్ళకంచెలు, పిచ్చిచెట్లు తొలగింపు చేస్తున్న నేపథ్యంలో 15 గ్రామ పంచాయతీలల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందన్నారు.

యడ్లపాడు మండలంలో...

యడ్లపాడు: మండలంలోని ఐదు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఆశాఖ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. 33కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా బుధవారం మండలంలోని కొత్తపాలెం, కొండవీడు, సొలస, చెంఘీజ్ ఖాన్‌పేట, లింగారావుపాలెం గ్రామాల పరిధిలో ఉదయం 9 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. కావున ఆయా గ్రామాల్లో గృహ, వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ బోర్లకు సంబంధించి ఎలాంటి విద్యుత్ సరఫరా ఉండదని, ఈ అసౌకర్యాన్ని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ డే



రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ మోడల్ స్కూల్‌లో బుధవారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ ట్రైనింగ్ డే పురస్కరించుకొని మొక్కలు నాటారు. దేశంలో ఉన్న స్కౌట్స్ అండ్ గైడ్స్ నాయకుల సేవకు చిహ్నంగా మొక్కలు నాటుతున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవి నాయక్ తెలిపారు. ఇతోధికంగా పర్యావరణాన్ని పరిరక్షించేందుకే మొక్కలు నాటామన్నారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ ట్రైనింగ్ సెంటర్ 1956 సెప్టెంబర్ 10వ తేదీన ప్రారంభించారన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు, డొక్కా సీతమ్మ స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రూప్‌లు పాల్గొన్నాయి.

విధుల్లో చేరిన గణపవరం పశువైద్యాధికారి

నాదెండ్ల: గణపవరం గ్రామీణ పశువైద్యాధికారి సీహెచ్ సాంబశివారెడ్డి తిరిగి విధుల్లో చేరారు. ఈ ఏడాది జులై 19న ఆయన సస్పెండైన విషయం విదితమే. రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ గణపవరం పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో డాక్టర్ సీహెచ్ సాంబశివారెడ్డి, అసిస్టెంట్ పవన్‌కుమార్ అందుబాటులో లేకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, ఇరువురినీ విధుల నుంచి సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఈ విషయమై రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడును విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. ఈ నేపథ్యంలో సాంబశివారెడ్డిపై సస్పెన్షన్ వేటు తొలగించటంతో విధుల్లో చేరారు.

మోస పోయామంటూ మహిళల ఫిర్యాదు



నూజెండ్ల: డ్వాక్రా మహిళల పొదుపు డబ్బులు కట్టకుండా కాలనీకి చెందిన మహిళ మోసం చేసిందని ఐనవోలు పోలీస్‌స్టేషన్‌లో వి.అప్పాపురం యస్సీ కాలనీ మహిళలు బుధవారం ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన సమాచారం ప్రకారం కాలనీకి చెందిన మహిళ గతంలో డ్వాక్రా యానిమేటర్‌గా పనిచేసేది. ఆ తర్వాత వేరే ఉద్యోగం రావటంతో అందులోకి చేరింది. స్థానికురాలు కావటం, ఆమెపై నమ్మకం ఉండటం, గ్రూపు సభ్యులు నిరక్షరాస్యులు కావటంతో పొదుపు డబ్బులు బ్యాంకులో కట్టమని ఆమెకే ఇచ్చేవారు. లోను చెల్లించటం లేదని ఇటీవల బ్యాంకు నుంచి నోటీసు రావటంతో విషయం బయట పడింది. షుమారు సంవత్సర కాలం నుంచి బ్యాంకులో డబ్బులు జమ చేయటం లేదని తేలిందని మహిళలు వాపోయారు. మొత్తం 4 గ్రూపుల సొమ్ము 20 లక్షల వరకూ స్వాహా చేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేమని అడిగితే తిరిగి మాపైనే పోలీస్ కేసు పెట్టిందని కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో పాలపర్తి అయ్యమ్మ, తూమాటి రమణ, దేవేంద్ర, గరిగల అంజమ్మ, కొత్త అంకమ్మ, సువార్త తదితరులు ఉన్నారు.

విద్యార్థులతో స్నేహంగా ఉంటాం

- పోలీస్ వ్యవస్థపై అవగాహన కలిగిస్తాం
- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు
- పోలీస్‌లుగా ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు అభినందన



పోలీస్‌లుగా ఎంపికైన వారిని అభినందిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులకు పోలీస్ వ్యవస్థపై అవగాహన కలిగేలా త్వరలో ఫ్రెండ్లీ పోలీస్ కార్యక్రమం చేపట్టనున్నట్టు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ 15 మంది ఇటీవల నిర్వహించిన సివిల్ పోలీస్ కానిస్టేబుల్ నియామక పరీక్షల్లో ఎంపిక కావటాన్ని పురస్కరించుకుని బుధవారం కళాశాల ఆడిటోరియంలో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను అర్ధాంతరంగా చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈనేపథ్యంలో విద్యార్థులకు ఫ్రెండ్లీ పోలీస్ ద్వారా ఎస్పీ కార్యాలయంలో ఒకరోజు పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు శారీరక, మానసిక శిక్షణ, పోలీస్ విధులు, ఆయుధాలు ఉపయోగించే విధానం తదితర అంశాలను ప్రత్యక్షంగా తెలియచేయనున్నట్టు ప్రకటించారు. ఎన్‌సీసీ క్యాడెట్స్, ప్రతి విద్యార్థి తమ తమ గ్రామ పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కానిస్టేబుల్స్‌గా ఎంపికైన 15 మందితో పాటు సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్, అగ్నివీర్ జవాన్‌ను అభినందించారు. మరో అతిథి 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ హవల్దార్ షంషేర్ సింగ్ మాట్లాడుతూ, ఎన్‌సీసీ క్యాడెట్స్ కృషిని అభినందిస్తూ ఇతర విద్యార్థులకు స్ఫూర్తి కావాలని ఆకాంక్షించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష్య, కార్యదర్శులు కపలవాయి విజయ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త మాట్లాడుతూ, విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను మరింత మెరుగుపరిచామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బి.ఎస్.రామకృష్ణరాజు, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి ఎం.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

చంఘిజ్‌ఖాన్ పేటలో 'పొలం పిలుస్తోంది'

- మూడు పంటలకు శాస్త్రవేత్త సూచనలు
- యూరియా వాడకంపై రైతులకు కీలక సూచనలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగేష్

యడ్లపాడు: మండలంలోని చంగిస్‌ఖాన్ పేట గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో ఏ హరిప్రసాద్‌తో కలిసి పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం నుండి సీనియర్ శాస్త్రవేత్త ఎం.నాగేష్ పాల్గొని రైతులతో సమావేశం అయ్యారు. పత్తి, మిరప, శనగ పంటలకు యూరియా వాడకంపై కీలక సూచన్లు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త నాగేష్ మాట్లాడుతూ పత్తి పంటకు 30 -60 రోజులప్పుడు ఒక బస్తా యూరియా, ఒక బస్తా ఎంటీపీ వేయాలని తెలిపారు. గులాబీ రంగు పురుగు నివారణకు పురుగు ఉధృతిని గుర్తించడానికి ఎకరానికి 20 లింగాకర్షక బుట్టలను పంట ఎత్తుకు ఒక అడుగు పైన ఏర్పాటు చేసుకోవాలన్నారు. వారం రోజుల్లో 10 శాతం కన్నా ఎక్కువ గుడ్డిపూలు, కాయలు గమనిస్తే వెంటనే పురుగుమందులు పిచికారీ చేయాలని తెలిపారు. 100 రోజులు పైబడిన మొక్కలపై మాత్రమే సింథటిక్ పైరిత్రాయిడ్ మందులను వాడాలన్నారు. మిరపలో వచ్చే తెగుళ్ల నివారణకు..పంట మార్పిడి చేయడం ద్వారా మిరపలో తామర పురుగులు, నల్లి తీవ్రతను తగ్గించవచ్చని, అలాగే నారు నాటే ముందు దుక్కిలో 10 కిలోల వేప పిండిలో కార్బోఫ్యూరాన్ గుళికలు కలిపి వేయడం వల్ల వేరు కుళ్ళు, ఇతర తెగుళ్లను నివారించవచ్చన్నారు. శనగ వేయాలనుకునే రైతులు దుక్కిని ఖాళీగా ఉంచకుండా జొన్న లేదా సజ్జ పంటలు వేయడం ద్వారా భూమి సారవంతమై శనగ పంటకు అనుకూలంగా మారుతుంది. ఇది రైతులకు అదనపు ఆదాయాన్ని కూడా ఇస్తుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, గ్రామ వ్యవసాయ సహాయకులు జ్యోష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోండి



దరఖాస్తు ఫాం విడుదల చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: పేద ఆర్యవైశ్య విద్యార్థుల చదువుకు సహాయపడేలా మండవ సీతారామాంజనేయులు జయశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు అందచేస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్ సీతారామాంజనేయులు బుధవారం తెలిపారు. ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కాలర్‌షిప్ దరఖాస్తులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏడు సంవత్సరాలుగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 101 మంది ప్రతిభ గల పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.2 వేలు చొప్పున అక్టోబర్ 11వ తేదీన శ్రీ సీతారామస్వామి దేవాలయంలో అందచేస్తామని వివరించారు. అర్హత గల విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా తమ దరఖాస్తులను పూర్తిచేసి అందివ్వాలని తెలిపారు. వివరాలకు 9490087779, 9246453348 నెంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శ్రీవాసవీ మిత్ర మండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, మండవ పూర్ణచంద్రరావు, పెనుగొండ ప్రభాకర్ పాల్గొన్నారు.

ద్రవ యూరియా వాడకంపై మొగ్గు చూపాలి

ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నూజెండ్ల: రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ డీఈ ఎస్.శ్రీనివాసరావు వెల్లడించారు. మండల కేంద్రమైన నూజెండ్ల రైతు సేవా కేంద్రంలో యూరియా వినియోగంపై రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో పంట సాగుకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని రైతు సోదరులు ఆందోళన చెందాల్సిన పని లేదని తెలిపారు. అవసరానికి మించి నిల్వలు ఉంచుకోరాదన్నారు. యూరియా కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్ల ఖర్చు పెడుతుందన్నారు. 50 కేజీల యూరియా రూ.2200కు కొనుగోలు చేసి రైతుకు రూ.220 రాయితీపై అందిస్తుందన్నారు. వేరు ద్వారా 30 శాతం తీసుకుంటే ఆకుల ద్వారా 70 శాతం మొక్క బలాన్ని తీసుకుంటుందన్నారు. రైతులు ద్రవ రూపంలో యూరియా వినియోగానికి (నానోయూరియా) మొగ్గు చూపాలన్నారు. తహసీల్దార్ రమేష్ కుమార్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లోనూ యూరియా ఎమ్మార్పీ మించి అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఎరువులు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు బచ్చు అంజిరెడ్డి, సర్పంచ్ వీర్ల వెంకట స్వామి, విస్తరణాధికారి ఎలీషా, సీఐవో గంగినేని శ్రీనివాసరావు, లగడపాటి సూరి, బేతపూడి చిరంజీవి పాల్గొన్నారు.

వ్యవసాయం తర్వాత పాడిరంగమే రైతుకు జీవనాడి

కాట్రా సురేష్ కుమార్



బోనస్ పంపిణీ చేస్తున్న దృశ్యం

యడ్లపాడు: వ్యవసాయంతో పాటు పాడిరంగం కూడా రైతులకు ఒక ముఖ్య ఆదాయ వనరుగా ఉందని సంగండైరీ పల్నాడు జోనల్ మేనేజర్ కాట్రా సురేష్‌కుమార్ చెప్పారు. యడ్లపాడు మండలం మేదరవీధిలోని సంగం డైరీ పాల ఉత్పత్తిదారుల సహకార కేంద్రంలో బోనస్ పంపిణీ కార్యక్రమం జరిగింది. సొసైటీ అధ్యక్షుడు పోపూరి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు పాలు అందించిన 130 మందికి మొత్తం రూ.6,48,198 బోనస్ అందజేశారు. కేంద్రానికి అత్యధికంగా పాలు అందించిన చెన్నుపాటి శ్రీనివాసరావు (34,465 లీటర్లు), గాండ్ల శ్రీహరి (34,352 లీటర్లు), షేక్ మస్తాన్‌వలి (24,756 లీటర్లు)తో పాటు మరో ఐదుగురికి అతిథులు ప్రత్యేక బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంగం డైరీ సూపర్‌వైజర్ పుట్టా వెంకటేష్, కేంద్రం అధ్యక్షుడు పోపూరి కృష్ణారావు, కార్యదర్శి కల్లూరి రామారావు, పాలకవర్గ సభ్యులు పావులూరి శ్రీనివాసరావు, సంగం డైరీ జనరల్ మేనేజర్ పాతూరి ఆదినారాయణ, సొసైటీ డైరెక్టర్లు అంబడపూడి విఘ్నేశ్వరరావు, డేగల పేతురు, సాగి నారయ్య, పోపూరి విజయలక్ష్మి, అంకం కృష్ణమూర్తి, దేరంగుల శివమ్మ, పసుపులేటి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జరిమానా

చిలకలూరిపేటటౌన్: మద్యం సేవించి వాహనాలు నడిపిన ఆరుగురు వ్యక్తులకు చిలకలూరిపేట ఏజేసీజే కోర్టు భారీ జరిమానా విధించింది. పట్టణ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఈ ఆరుగురు వ్యక్తులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. పోలీసులు వారిని కోర్టులో హాజరుపరచగా, ఒక్కొక్కరికీ రూ. 10వేల చొప్పున మొత్తం రూ.60 వేలు జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడినవారు మరోసారి ఇదే నేరం చేస్తే జైలు శిక్ష తప్పదని న్యాయమూర్తి హెచ్చరించారు.

మైదవోలులో బాలికల కోసం 'కిశోరి వికాసం' కార్యక్రమం



యడ్లపాడు: మండలంలోని మైదవోలు గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం బుధవారం జరిగింది. ముందుగా కేంద్రం పరిధిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ మాట్లాడుతూ చిన్న వయసులోనే పెళ్లి చేసుకోవడం వల్ల కలిగే నష్టాలను, అనర్థాలను వివరించారు. దీని వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను, చదువుకు దూరమయ్యే పరిస్థితులను తెలిపారు. చదువుకోవడం వల్ల కలిగే లాభాలను, అది భవిష్యత్‌ను ఎలా మార్చుతుందో వివరించారు. బాలికలు తప్పనిసరిగా చదువు కొనసాగించాలని ప్రోత్సహించారు. వ్యక్తిగత పరిశుభ్రత (పర్సనల్ హైజీన్) పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులు రాకుండా ఎలా జాగ్రత్తపడాలో తెలియజేశారు. సురక్షితమైన స్పర్శ, ప్రమాదకరమైన స్పర్శల మధ్య తేడాను వివరించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే ఎలా ప్రతిస్పందించాలో, ఎవరికి చెప్పాలో నేర్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు శిరీష, ఆశ వర్కర్ బి. నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు జి. శకుంతల, కె. సునీత తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు బిక్ష ఏర్పాటు అభినందనీయం



నాదెండ్ల: భగవంతుడిపై అచంచల భక్తితో కఠోర దీక్షలు పాటించే మాలధారులకు బిక్ష ఏర్పాటు అభినందనీయమని చిలకలూరిపేట రూరల్ ఎస్సై అనిల్‌కుమార్ చెప్పారు. గణపవరం కుప్పగంజివాగు సమీపంలో నిర్మాణంలో ఉన్న అయ్యప్పస్వాముల అన్నదాన కార్యక్రమంలో బుధవారం ఎస్సై అనిల్‌కుమార్ దంపతులు పాల్గొన్నారు. ముందుగా అయ్యప్పస్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వయంగా మాలధారులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, సమాజంలో శాంతిసౌభాగ్యం నెలకొని ప్రజలు ప్రశాంతంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గురుస్వాములు శివనారాయణరాజు, మండలనేని వెంకటేశ్వర్లు, మండలనేని శ్రీనివాసరావు, జనసేన యువనాయకుడు మండలనేని చరణ్‌తేజ పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు భారతీ సిమెంట్ నాణ్యమైంది

- కంపెనీ సీనియర్ ఆఫీసర్ కె.జయరామిరెడ్డి
- మేస్త్రీలు, కార్మికులకు బాండ్లు అందజేత



బాండ్లు అందజేస్తున్న సిమెంటు కంపెనీ ప్రతినిధులు

నరసరావుపేట: సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి తయారుచేసిన నాణ్యమైన భారతీ సిమెంట్‌ను భవన నిర్మాణాలకు ఎంచుకోవాలని ఆ కంపెనీ సీనియర్ ఆఫీసర్ కె.జయరామిరెడ్డి సూచించారు. మంగళవారం సాయంత్రం టెక్నికల్ అధికారి భవానీ శంకర్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు లక్ష రూపాయల బీమా కల్పించే కార్యక్రమం లింగంగుంట్ల కాలనీలోని సిమెంట్ డీలర్ పొన్నపాటి మోహన్‌రెడ్డికి చెందిన మోహన్ స్టీల్ అండ్ సిమెంట్ షాపు వద్ద నిర్వహించారు. నిర్మాణ కార్మికులు, మేస్త్రీలకు భారతీ సిమెంట్‌పై అవగాహన కలిగించారు. భారతీ సిమెంట్‌తో స్లాబు వేస్తే తమ కంపెనీ ప్రతినిధులు ఏడురోజుల్లో అక్కడకు వచ్చి నాణ్యతను పరిశీలించటం జరుగుతుందన్నారు. కార్మికులు, మేస్త్రీల సందేహాలను నివృత్తి చేశారు. హాజరైన మేస్త్రీలు, కార్మికులకు లక్ష రూపాయల బీమా సదుపాయం కల్పించే బాండ్లు అందజేశారు. కార్యక్రమంలో పొన్నపాటి లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలు ప్రజలకు చెబుదాం

- వైఎస్సార్‌సీపీ యడ్లపాడు అధ్యక్షులు వడ్డేపల్లి నరసింహారావు
- లింగారావుపాలెంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం



క్యూఆర్ కోడ్లతో కూడిన కరపత్రాల్ని ఆవిష్కరించిన పార్టీ నాయకులు



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న నాయకులు

యడ్లపాడు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తామని వైఎస్సార్ సీపీ యడ్లపాడు మండలం అధ్యక్షులు వడ్డేపల్లి నరసింహా రావు తెలిపారు. మండలంలోని లింగారావుపాలెంలో బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాబూ ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులు హాజరై ఇంటింటి కార్యక్రమానికి చేపట్టారు. కార్యక్రమానికి క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చక అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, ఇరవై లక్షల ఉద్యోగాల కల్పన అమలు చేయలేదని, దీంతో ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేక వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర కాల పాలనలో అభివృద్ధి, సంక్షేమం శూన్యమని విమర్శించారు. కూటమి పాలనలో అక్రమ కేసులు పెట్టడం, అవినీతి అక్రమాలు పెరిగాయన్నారు. పార్టీ సీనియర్ నాయకులు ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పేదల జీవితాల్లో చీకట్లు నింపారని మండిపడ్డారు. సామాజిక పెన్షన్లలో తీవ్రంగా కోతలు పెట్టారని, చివరకు దివ్యాంగుల పెన్షన్లను కూడా తగ్గించడంతో వారి జీవితాలు అగమ్య గోచరంగా మారాయన్నారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి కూటమి నాయకుల మోసాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే తిరిగి జగనన్న రాజ్యం రావాల్సిందేనన్నారు. ఏడాదిన్నర కాలంలోనే ప్రజల నుంచి ఇంతపెద్ద ఎత్తున్న వ్యతిరేకత మూట కట్టుకున్న ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదని విమర్శించారు. సుపరిపాలనలో తొలి అడుగు అంటూ టీడీపీ చేస్తున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మడం లేదన్నారు. పథకాలన్నీ అమలు చేయకుండానే సూపర్‌సిక్స్ సూపర్‌సక్సెస్ అంటూ ఆ పార్టీ సభలు నిర్వహించి గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, కొల్లా పేరయ్య, మద్దు శ్రీనివాసరావు, రాంబాబు, సీతయ్య, విప్పర్ల రామారావు, గుంటి జోసఫ్, షేక్ రసూల్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేతో మహిళా విభాగ సభ్యుల భేటీ



మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును సత్కరిస్తున్న మహిళలు

వినుకొండ : స్థానిక మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబరు బొల్లా బ్రహ్మనాయుడును రాష్ట్ర మహిళా విభాగ ఉపాధ్యక్షురాలు, పల్నాడు జిల్లా మహిళా విభాగ ఇన్‌చార్జి బుల్ల మేరికుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మహిళా కమిటీల గురించి చర్చించడం జరిగింది. ఆమెతో పాటు జిల్లాలోని వివిధ హోదాల్లో ఉన్న మహిళలు పాల్గొన్నారు.

పీఎఫ్ ఖాతాలు ఏర్పాటు చేయాలి

ఎస్టీయూ స్టేట్ డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు



ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

చిలకలూరిపేట: ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ ఖాతాలు ఏర్పాటు చేయాలని ఎస్టీయూ స్టేట్ డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు కోరారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం మున్సిపల్ పాఠశాలల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత దశాబ్దకాలంగా మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. సాధారణ కార్మికులకు సైతం ప్రావిడెంట్ ఫండ్ ఖాతా ఉంటుందని,అలాగే ప్రైవేటు టీచర్లకు కూడా పీఎఫ్ ఖాతా ఉంటుందని, మున్సిపల్ ఉపాధ్యాయులకు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఇబ్బందిని ప్రభుత్వం గుర్తించి వెంటనే పీఎఫ్ ఖాతాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై ఎస్టీయూ పోరాడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, పట్టణ శాఖ అధ్యక్షుడు మేకల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వడ్లాన జయప్రకాశ్, ఆర్థిక కార్యదర్శి హనుమంతు నాయక్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం

బొల్లాపల్లి: బండ్లమోటు సెక్షన్ పరిధిలో పలు గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు విద్యుత్ శాఖ డీపీఈ, ఈఈ సి.హెచ్.వెంకటేశ్వరరావు, ఆపరేషన్ విభాగం ఈ ఈ సి.హెచ్.రాంబట్లు బుధవారం మీడియాకు వెల్లడించారు. మీటర్ లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన 31 మందిపై, మీటర్ ఉన్న అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఆరుగురిపై, అనుమతించిన కేటగిరిని దుర్వినియోగం పరుస్తూ, ఇతర కేటగిరీలో విద్యుత్ వాడుకుంటున్న ముగ్గురిపై అనుమతించిన లోడు కంటే అదనంగా వాడుకుంటున్న 72 మందిపై విద్యుత్ చౌర్యం కింద రూ 2.94 లక్షల అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని తెలిపారు. అక్రమ విద్యుత్ వాడకంపై సమాచారం ఇవ్వదలచిన వారు 9440812263, 8639741050 నెంబర్లను సంప్రదించవచ్చని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, డీపీఈ (విజిలెన్స్), ఆపరేషన్ ఈ ఈ లు తెలిపారు.

డ్రోన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు అభినందనీయం

నరసరావుపేట రూరల్: వ్యవసాయంలో డ్రోన్ వినియోగం పెరుగుతున్న దృష్ట్యా డ్రోన్ సర్వీస్ సెంటర్ పట్టణంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. సత్తెనపల్లిరోడ్డులో ఇలా అగ్రి సర్వీస్, దక్ష అథరైజ్డ్ డ్రోన్ సర్వీస్‌ను బుధవారం జగ్గారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్‌ను వినియోగిస్తున్న రైతులు, వర్ధమాన డ్రోన్ ఆపరేటలర్స్ డ్రోన్ రిపేర్స్, స్పేర్స్ కోసం సదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. దీని వలన సమయం, ధనం వృధా అవుతుందని తెలిపారు. నాణ్యమైన డ్రోన్ రిపేరు, నమ్మకమైన స్పేర్స్ ఈ సెంటర్‌లో పొందగల్గుతారని పేర్కొన్నారు. ఇలా అగ్రి సర్వీసెస్ ప్రాజెక్ట్ మేనేజర్ జి.శివనాగశ్వరరావు మాట్లాడుతూ అన్ని రకాల డ్రోన్‌ల మరమ్మత్తులు కేవలం 12 గంటల వ్యవధిలో చేయబడుతుందని తెలిపారు. దీంతో పాటు స్లాట్‌లు బుక్ చేసుకుంటే తమ సర్వీస్ సెంటర్ ద్వారా డ్రోన్‌ల వినియోగించి పురుగు మందు పిచికారీ చేసే సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో దక్ష డ్రోన్ డీజీఎం గోపాలకృష్ణన్, ఇప్కో రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ బీఎల్ రాజు తెలిపారు.

రొంపిచర్లలో ఆరంభమైన పశువుల సంత



పశువుల సంత ప్రారంభిస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ మొండితోక రాణి

రొంపిచర్ల: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వారాంతపు పశువులు, గొర్రెల సంతను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ మొండితోక రాణి అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం పశువుల సంతను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రొంపిచర్ల మండలం లోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు పశు పోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. రైతులు తమ పాడి పశువులు అమ్ముకోవాలన్నా, కొనుగోలు చేయాలన్నా దూర ప్రాంతాలకు రవాణా ఖర్చులు భరించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం రవాణా ఖర్చులు అవసరం లేకుండా రైతులకు మార్కెట్ సౌలభ్యం చేరువ చేయాలనే సంకల్పంతోనే పశువుల సంత ఏర్పాటు చేశామన్నారు. ప్రతి బుధవారం పశువుల సంత, గురువారం గొర్రెల సంత జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, నాయకులు కొల్లి బ్రహ్మయ్య, ఇమ్మడిశెట్టి కాశయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, మొండితోక రామారావు, వడ్లమూడి వెంకట కిషోర్, పచ్చవ కోటేశ్వరరావు, వాసిరెడ్డి రవి, పాల్గొన్నారు.